ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
గురువారం 25 జూలై 2024

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు - రామగుండం సీపీ శ్రీనివాస్ 8లో..

ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి 8లో..



అందరి చూపు.. 'ఎల్లంపల్లి' వైపు..

- నీరు లేక వెలవెలబోతున్న ఎల్‌ఎండీ, మిడ్ మానేరు
- ఎస్సారెస్పీలో అంతంత మాత్రంగానే నీరు..
- ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తేనే పంటలు సాగు
- 13 టీఎంసీలకు చేరుకున్న నీటి మట్టం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులకు వరప్రదాయిని అయిన ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ, మిడ్ మానేరులోకి సరిపడా నీరు రాకపోవడంతో అందరిచూపు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుపై పడింది. ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోక ముందే అక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తే వానాకాలం పంటల సాగు ముందుకు సాగనున్నది. వర్షాకాలం ప్రారంభమై 55 రోజులు గడుస్తున్నా కూడా గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్టుల్లోకి వరద నీరు రాలేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితి దయనీయంగా ఉంది. పోచంపాడ్‌లో గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.167 టీసీలకు చేరుకున్నది. 19,500 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గత ఏడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీ నీటి మట్టం 55 టీసీలుగా ఉంది. అప్పటికీ, ఇప్పటికీ 30 టీఎంసీల తేడా ఉంది. సాధారణంగా ప్రాజెక్టులో 50 టీఎంసీలకు నీటి మట్టాలు దాటితేనే ఆయకట్టు భూములకు సాగు నీటిని విడుదల చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా సరస్వతి, లక్ష్మి, కాకతీయ కాలువల ద్వారా నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని 5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. అక్కడి నుంచి కాకతీయ ప్రధాన కాలువ ద్వారా ఎల్‌ఎండీకి నీటిని సరఫరా చేసి దాని కింద కరీంనగర్, వరంగల్, హన్మకొండ, తదితర జిల్లాల్లోని 4.5 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించాల్సి ఉంది. అయితే ఎల్‌ఎండీ పరిస్థితి కూడా బాగా లేదు. దాని పూర్తిస్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.280 టీఎంసీల నీరు ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 945 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఎల్‌ఎండీలోకి కనీసం 15 టీఎంసీల నీరు రానిదే ఆయకట్టు భూములకు సాగు నీటిని విడుదల చేయరు. ఎల్‌ఎండీకి ఎగువ భాగాన గల మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటిమట్టం 27.54 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.89 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవాలంటే ఎల్‌ఎండికి 18.70 టీఎంసీల నీళ్లు, మిడ్ మానేరులోకి 22 టీఎంసీల నీళ్లు చేరుకోవాల్సి ఉంది. మొత్తం 40 టీఎంసీల నీళ్లు అవసరం. గత ఏడాది జూలై నెలాఖరు నుంచి ఆగస్టు నెలలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, ఎల్‌ఎండీ రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పూర్తి స్థాయి నీటి మట్టాలకు చేరుకున్నాయి. గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలి పెట్టారు. కానీ ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

• వరద నీరంతా సముద్రంలోకి..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు జరగడంతో ఆయా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో వరద నీరంతా గోదావరి గుండా సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కూడా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. గత ఏడాది ఇదే సమయానికి ఎల్లంపల్లిలో 16.538 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. జూలై మొదటి వారంలో వర్షాలు పడకపోవడంతో కాళ్వేరం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లిలోకి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అక్కడినుంచి మిడ్ మానేరుకు తరలించారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత ఎత్తిపోతలను నిలిపివేశారు. వారం రోజులుగా ఎల్లంపల్లి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి సుమారు 7 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. బుధవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులోకి 6,525 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.864 టీఎంసీలకు చేరుకున్నది. గురువారం నాటికి 13 టీఎంసీలకు చేరుకోనున్నది. కడెం, ఎల్లంపల్లి ఎగువ ప్రాంతంలో మరిన్ని భారీవర్షాలు కురిస్తే మాత్రం వారం రోజుల్లోనే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోనున్నదని నీటి పారుదల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల పరిస్థితి, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటిని అంచనా వేసి అదనపు నీటిని గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలిపెట్టకుండా మోటార్లు ఆన్‌చేసి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు తరలించాలని రైతులు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి మిడ్‌మానేరు నుంచి ముందుగా ఎల్‌ఎండీకి నీటిని విడుదల చేసి ఆ తర్వాత మల్లన్నసాగర్‌కు తరలించేందేందుకు నీటి పారుదల శాఖాధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ డి-83, డి-86 కాలువల ద్వారా జిల్లాలో 1,82,699 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి రావాల్సి ఉన్నాయి. చాలా మంది రైతులు వరి నార్లు పోసి నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నాట్లు వేసే పరిస్థితి ఉన్నా, ప్రాజెక్టు నిండక నీటిని విడుదల చేయకుంటే నిలువునా మునగాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఎస్సారెస్పీలోకి కనీసం 45 టీఎంసీల నీళ్లు వచ్చినా వర్షాధారంతో ఆయకట్టు భూముల్లో వరి నాట్లు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు. మిడ్ మానేరు, ఎల్‌ఎండీలకు క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి సరిపడా నీళ్లు రాకుంటే మాత్రం ఎల్లంపల్లి నుంచే వాటికి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. వర్షాలను బట్టి ప్రభుత్వ ఆదేశాల మేరకు నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరుకు నీటిని తరలిస్తామని నీటి పారుదల శాఖాధికారులు అంటున్నారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, జూలై 24 : మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో మహిళా సాధికారతకు సంబంధించి మహిళలు, యువతుల ఆరోగ్య సమస్యలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసంగించారు. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, గర్భిణుల సమస్యలు, క్యాన్సర్ ఇతర వ్యాధులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా మహిళల రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, పరిశుభ్రతను పాటించే విషయాలను అదనపు కలెక్టర్ వివరించారు. మహిళలు, యువతులు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఏ చిన్న అనారోగ్య సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆశాలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసన్న, ప్రొఫెసర్ శ్రీదేవి, జిల్లా మహిళా సాధికారత నిర్వాహకురాలు దయ అరుణ, పెద్దపల్లి, రామగుండం సీడీపీవోలు కవిత, స్వరూపరాణి, బాల సంరక్షణ భవన్ సభ్యులు సుగుణ, కమలాకర్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, సఖి కోఆర్డినేటర్ స్వప్న, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

రామగుండం ఎంవీఐగా సంతోష్‌రెడ్డి

జ్యోతినగర్, జూలై 24 : రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)గా కె.సంతోష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సిద్దిపేట ఎంవీఐగా పని చేస్తున్న సంతోష్‌రెడ్డిని రామగుండంకు బదిలీ చేశారు. ఇక్కడ ఎంవీఐగా పని చేస్తున్న భీం సింగ్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు బదిలీ చేశారు.

డీఎస్సీ పరీక్షకు 306 మంది అభ్యర్థులు హాజరు

పెద్దపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న డీఎస్సీ నియామకాల పరీక్షకు బుధవారం 372 మందికి 306 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సెంటినరీ కాలనీ జేఎన్‌టీయూ కళాశాలలో 197 మందికి 152 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 85మంది అభ్యర్థులకు 79 మంది హాజరయ్యారు. పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 90 మంది అభ్యర్థులకు 75 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

కండీషన్ లేని ఆర్టీసీ బస్సులను స్క్రాప్‌నకు పంపండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 24: రాష్ట్రంలో కండీషన్‌లో లేని ఆర్టీసీ బస్సులను స్క్రాప్‌నకు పంపాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో చాలా బస్సులు కాలం చెల్లాయని, వాటితో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫిట్‌నెస్ లేని బస్సులను రోడ్లపై తిప్పడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని ఆయన సూచించారు. ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు మీద తిరుగుతున్నాయని, వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, బస్సులపై పూర్తి వివరాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రామగుండంలో ఓ స్కూల్ ఆటో నుంచి పడి విద్యార్థిని మృతి చెందిందని, ఆ ఘటన తనను కలచివేసిందని మక్కాన్‌సింగ్ అన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని స్కూల్, కాలేజీల వాహనాలను రోడ్లపై తిప్పకుండా చూడాలని రవాణాశాఖ మంత్రిని కోరారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

పాలకుర్తి, జూలై 24: స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులను నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని, విషజ్వరాలు అంటువ్యాధులు, డెంగ్యూ జ్వరాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పొల్సాని శశికళ, ఎంపీవో షబ్బీర్ పాషా, ఏపీఎం సదానందం తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం, జూలై 24: విధి నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా అప్రమత్తం ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టర్ అంతర్గాం మండలాన్ని సందర్శించారు. ఎంపీడీఓ అలీమ్, డిప్యూటీ సీఈఓ సంధ్యారాణి, ఎంపీఓ అబ్దుల్ వాజిద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళి, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో పలువురు ఎస్సైల బదిలీ

కోల్‌సిటీ, జూలై 24: రామగుండం కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సీపీ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం సీఎస్‌బీ ఎస్‌ఐగా పని చేస్తున్న డీ కిరణ్ కుమార్‌ను తాండూరు ఎస్‌హెచ్‌ఓగా, తాండూరు ఎస్‌సీ సీహెచ్ కిరణ్‌కుమార్‌ను సీఎస్‌బీ రామగుండంకు బదిలీ చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పీఎస్‌లో పని చేస్తున్న సౌజన్యను మందమర్రి ఎస్‌హెచ్‌ఓగా, మందమర్రిలో పని చేస్తున్న అనూషను రామగుండం వీఆర్‌కు బదిలీ చేశారు. రామకృష్ణాపూర్‌లో ఎస్‌ఐ-2గా పని చేస్తున్న మహేందర్‌ను బెల్లంపల్లి టుటౌన్ ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న రమేష్‌ను రామగుండం వీఆర్‌కు బదిలీ చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ తిర్యాణిలో పని చేస్తున్న సీహెచ్ రమేష్‌ను తాళ్లగురిజాల ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న నరేష్‌ను వీఆర్‌లోకి పంపారు. ములుగు వీఆర్‌లో ఉన్న అశోక్‌ను ఘన్‌పూర్ ఎస్‌హెచ్‌ఓగా, అక్కడ పని చేస్తున్న సాంబమూర్తిని భూపాలపల్లిలోని సీసీఎస్‌కు బదిలీ చేశారు.

ప్రిన్సిపాల్ ఫిర్యాదుపై విచారణ

పెద్దపల్లి రూరల్, జూలై 24 : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహ్మద్‌మేరాజ్ మహ్మద్ ఇబ్బందులు పెడుతున్నాడని మంథని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదుపై బుధవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత రాఘవపూర్‌లోగల మంథని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సబిత తెలిపారు.

'బీసీ డిక్లరేషన్‌పై మాట తప్పిన కాంగ్రెస్'

అంతర్గాం, జూలై 24: బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాట తప్పిందని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం రామగుండం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ తిరుపతికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను ఏడు నెలలు గడుస్తున్నా నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, క్యాతం వెంకటరమణ, మిట్టపల్లి సతీష్, భూమన్న, రమేష్, నవీన్, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో వివిధ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవం కార్యక్రమం ద్వారా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు పక్కన అవకాశం ఉన్నచోట మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ కింద గతంలో పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్, అటవీ ప్రాంతాల్లో నాటిన మొక్కలను పరిశీలించి, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని, సీజనల్ వ్యాధులను నియంత్రణకు పటిష్టంగా పారిశుధ్య నిర్వహణ అమలు చేయాలన్నారు. నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేయాలని, ఫీవర్ సర్వే నిర్వహించి తీరని వ్యాధి లక్షణాలు గల వారిని ముందుగానే గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఎఫ్‌వో శివయ్య, డీఆర్‌డీవో కె రవీందర్, వైద్య అధికారులు ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

పెద్దపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల మండలాల స్కూల్ కాంప్లెక్సు హెడ్ మాస్టర్లు, మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలకు విద్యార్థులు రెగ్యులర్ హాజరయ్యేందుకు కృషి చేయాలన్నారు. హాజరు శాతం తక్కువ ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు, వ్యక్తిత్వం పెంపొందించే విధంగా నీతికథలు, మోరల్‌స్టడీస్ గురించి బోధించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో మాధవి, అకాడమిక్ అధికారి షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

నేడు ముత్తారం మండలంలో కలెక్టర్ పర్యటన

ముత్తారం, జూలై 24 : ముత్తారం మండలంలో ఈనెల 25న కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించనున్నట్లు జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తారం మండల పర్యటనలో భాగంగా ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ అందుబాటులో ఉంటారని, ఏవైనా సమస్యలు ఉంటే మండల ప్రజలు నేరుగా కలిసి సమస్యకు సంబంధించిన దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

రక్షణను పాటిస్తూ విధులు నిర్వహించాలి

- రామగుండం మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ, జూలై 24: రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బందికి కీలక పాత్ర అని మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, బెల్లం, పాదరక్షాలు, కొబ్బరినూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు రక్షణను పాటిస్తూ విధులు నిర్వహించాలని, వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సునీల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- రహదారుల వెంట విరివిగా మొక్కలు నాటాలి - పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి రూరల్, జూలై 24 : పెద్దపల్లి మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు వన మహోత్సవం, శానిటేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ వన మహోత్సంలో భాగంగా గ్రామాలతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని శుభ్రం చేయించాలని, ఇంటింటికి సరఫరా అయ్యే మంచినీటి పైప్‌లైన్‌లు మరమ్మతులు ఉంటే తక్షణమే చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీరు సరఫరా అయ్యే నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. ఇంటి సంబంధిత ధ్రువపత్రాలు ఉంటే ఇంటి అనుమతులు ఇవ్వాలని, అనుమతులు లేని లేఅవుట్స్‌ను పూర్తిగా అరికట్టడంతో పాటు యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, మురికి కాలువలు శుభ్రం చేయించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాల రూరల్, జూలై 24 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనే వ్యక్తి గత కొన్నిరోజుల క్రితం ఎస్సారెస్పీ భూమిలో నాటిన 150 ఈత చెట్లను ధ్వంసం చేశాడని ఎస్సై సధా కర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన ఈత చెట్లను తొలగించిన తిరుపతిరెడ్డిపై జగిత్యాల రూరల్ ఎంపీడీఓ బుధవారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతిరెడ్డిపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

● 52.1గ్రాముల బంగారం, 55 గ్రామాలు వెండి ఆభరణాలు

● ద్విచక్ర వాహనం, మొబైల్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 24: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై చిరంజీవితో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్‌లు అనే ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ఈనెల 12న ఇంటికి తాళం వేయగా దానిని ఇనుప రాడ్‌తో పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరవాలో దాచుకున్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే ఇద్దరు దొంగలు ఈ నెల 22న ఇబ్రహీంపట్నం శివారులో మహిళను కత్తితో బెదరించి మెడలోని తాళి ఎత్తుకెళ్లారు. బాధితు రాలు ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ ఆదేశాల మేరకు మెట్ పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి సుమారు రూ. 4 లక్షల విలువ గల 52.1గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్, జూలై 24: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో వరకట్నం వేధింపులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన ఎనగంటి రేఖ (25)కు ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెకు చెందిన అంజనేయులుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అంజనేయులు తరచూ తాగివచ్చి గొడవకు దిగేవాడు. అదనంగా కట్నం తేవాలని వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. రేఖ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 24: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడని రెండో టాణా హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. కరీంనగర్ మతాశిశు ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 15న స్పృహ తప్పిపడి పోగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రెండో టాణా సీఐ 8712670762 లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జగిత్యాలరూరల్, జూలై 24: జగిత్యాల రూరల్ మండ లం మోరపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రాజు (45) గ్రామ శివారులోని చెరువులోకి తన తమ్ముడు గణేష్‌తో కలిసి బుధవారం చేపల వేటకు వెళ్లారు. విద్యుత్ వైర్లతో చేపలుపడుతున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యకేతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి..

జ్యోతినగర్, జూలై 24: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి లోని మాతంగి కాలనీలో మంగళవారం రాత్రి తుంగపిండి రాజమ్మ (55)పై ఇంటి పక్కనే ఉంటున్న మేకల సమ్మయ్య గొడ్డలితో దాడి చేశాడు. రాజమ్మను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన లారీ

శంకరపట్నం, జూలై 24: మండలం కేశవపట్నంలో ఓ లారీ అదుపు తప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది. మండలంలోని కరీంపేటకు వెళ్తున్న లారీ కేశవపట్నంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది.

బస్సులో రూ. రెండు లక్షలు లభ్యం

పోలీసులకు అప్పగించిన యువకులు



హుజూరాబాద్‌లో ఎస్ఐ హైమద్‌అలీకి నగదును అందజేస్తున్న యువకులు

హుజూరాబాద్, జూలై 24: బస్సులో లభించిన రెండు లక్షల రూపాయలను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు ఇద్దరు యువకులు. బుధవారం పరకాల నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి రెండు లక్షల రూపాయలు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయాడు. అదే బస్సులో బెజ్జంకికి చెందిన విలసాగరం ప్రమోద్, రేగొండకు చెందిన మొర ఉదయ్‌కుమార్ అనే యువకులు ప్రయాణిస్తున్నారు. బస్సులో సీటుపై ఉన్న బ్యాగ్‌ను చూడగా అందులో రెండు లక్షలు రూపాయలు కనిపించాయి. వారు ఆ నగదును తీసుకెళ్లి హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ హైమద్‌అలీకి అప్పగించారు. ఎస్ఐ హైమద్ అలీ ప్రమోద్, ఉదయ్‌కుమార్‌లను అభినందించారు. విచారణ జరిపి బ్యాగ్ మరిచిపోయిన వ్యక్తికి నగదును అందజేస్తామని ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేష్‌నగర్, జూలై 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ బుధవారం విడుదల చేశారు. బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు ఒకటి నుంచి 8వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలు..

శాతవాహన యూనవర్సిటీ పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్ లా పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్లు (సప్లిమెంటరీ) పరీక్షలు ఆగస్టు 1 నుంచి 9వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

శిథిలావస్థలో.. వేద పాఠశాల భవనం



పురాతన భవనంలో కొనసాగుతున్న రాజరాజేశ్వర వేద పాఠశాల

- విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు
- వసతులు కల్పిస్తే పెరగనున్న సంఖ్య
- నూతన వేద పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్



ర్యాక్‌లపైన విద్యార్థుల దుస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 24: వేములవాడలోని వేద పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో జూన్ 2018లో వేద, ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో రాజ రాజేశ్వర వేద పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు పండితులు వేద విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. చిన్నారులు హిందూ ధర్మ పరిరక్షణకు నిమగ్నమై ఉచ్చరించే మంత్రాలు చుట్టుపక్కల నిత్యం ప్రతిధ్వనిస్తున్నాయి. వేదానికి ఊపిరినిచ్చే పాఠ శాల శిథిలావస్థకు చేరుకుంటోందని, నూతన భవనం నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు వేద పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఋగ్వేదం 9, యజుర్వేదం 8, సామవేదం 7, అధర్వణ వేదం 5, స్మార్తం 1 హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉండగా మరో స్మార్తం, వేదం చదివే ఐదుగురు విద్యార్థులు ఇంటి నుంచి వస్తున్నారు. బీహార్ నుంచి ఒక విద్యార్థి, మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు విద్యార్థులు వేములవాడ వేద పాఠశాలలో వేదాలను చదువుతున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

పురాతన భవనంలో వేదపాఠాలు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయం జీ ప్లస్ వన్ అంతస్థుల పురాతన భవనంలో కొనసాగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లో ఒకే చోట విద్యార్థులకు విద్యాబోధన చేపడుతున్నారు. మొదటి అంతస్థులో విద్యార్థులకు కిచెన్ సామగ్రి ఏర్పాటుకు, భోజనశాల, విద్యార్థులు దుస్తులు భద్రపరుచుకునేందుకు వాడుతున్నారు. విద్యాబోధన చేస్తున్న గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లోనే విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రిస్తున్నారు. విద్యార్థులు మంత్రాలను కంఠస్థం చేయాల్సి ఉన్నందున విడివిడి గదులు ఉండాల్సి ఉండేది. గదులు లేకపోగా ఒక హాల్ లోనే విద్యార్థులు విద్యాబోధన చేయడంతో ఇబ్బందికరంగా మారుతోంది.

వేద పాఠశాల నిర్మాణానికి ప్రణాళిక

ఆంజనేయశర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వేదపాఠశాల, వేములవాడ.




వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టులో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు వేదాలకు నలుగురు వేద పండితులు అందుబాటులో ఉన్నారు. వేద పాఠశాలను అత్యధునాతన టెక్నాలజీతో విశాలమైన స్థలంలో నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా వేద పాఠశాలను నిర్మించాలని గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.



చదువుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు అందుబాటులో నాలుగు వేదాలు..


రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో నలుగురు వేద పండితులు నాలుగు వేదాలను అందిస్తున్నారు. ఋగ్వేదం శాఖల శాఖ 10 సంవత్సరాలు, యజుర్వేదం కృష్ణ యజుర్వేదం 11, 12 సంవత్సరాలు, సామవేదం కౌథురశాఖ 10 సంవత్సరాలు, అథర్వణవేదం శౌనఖ శాఖ 5,6 సంవత్సరాల పాటు చెప్పపడుతుందని అధికారులు తెలిపారు. స్మార్తం 4 సంత్సరాలు ఉంటుందని, వేదం, ఆగమం, సంస్కృతం విద్యార్థులకు బోధిస్తున్నట్లు తెలిపారు. వేద గణితం, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



వేదపాఠశాలలో విద్యార్థులు

ఆర్మేనియా, రష్యాలో ఉద్యోగాల పేరిట మోసం

● గల్ఫ్ ఏజెంట్ అరెస్టు ● వివరాలు వెల్లడించిన రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, జూలై 24: ఆర్మేనియా, రష్యాలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన రుద్రంగి మండలం మానాల అడ్డబోర్ తండాకు చెందిన అజ్మీరా కిషన్ అనే గల్ఫ్ ఏజెంట్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గల్ఫ్ ఏజెంట్ కిషన్ తన ఇద్దరితో కలిసి ఆర్మేనియా, రష్యాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, లక్షల్లో జీతాలు వస్తాయని అమాయక యువకులను నమ్మిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మానాల గ్రామానికి చెందిన కోల కృష్ణం రాజు వద్ద ఉపాధి నిమిత్తం ఆర్మేనియా నుంచి రష్యా పంపిస్తానని నెలకు లక్ష జీతం వస్తుందని చెప్పి రూ. 4.50 లక్షలు వసూలు చేశాడు. ఇదే విధంగా పెగ్గర్లకు చెందిన రంజిత్ వద్ద రూ.7.50 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గరిపెల్లి శశిధర్ వద్ద రూ.6.50 లక్షలు, అంబారి పేట నరేష్ వద్ద రూ. 4.70 లక్షలు, ఆత్మకూరుకు చెందిన పుప్పాల సందీప్ వద్ద రూ. 7.50 లక్షలు, మర్రిమాడుకు చెందిన అమరకొండ అనిల్ వద్ద రూ. 4.30 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గుంటుక రాజేశ్ వద్ద రూ.2.50 లక్షలు తీసుకొని విజిట్ వీసాలు ఇచ్చి ఆర్మేనియా పంపాడు. అక్కడ 3 నెలలు ఉంచి ఎలాంటి పని చూపించకుండా వసతులు కల్పించకుండా మోసం చేశాడు.

బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టగా అజ్మీరా కిషన్, నేపూరి తిరుపతి, కాల్వ ఉమామహేశ్ మోసాలకు పాల్పడినట్లు తేలిందని, ఇందులో అజ్మీర కిషన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ముగ్గురు కలిసి 60మంది యువకులను గల్ఫ్ పంపిస్తామని మోసం చేశారని, ఎవరైనా బాధితులు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోస పోవద్దని అన్నారు. ఇమిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గల్ఫ్ ఏజెంట్ల వివరాలు అవసరమైన యువకులు స్పెషల్ బ్రాంచ్ 8712656411కు ఫోన్ చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, జూలై 24: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన చిక్కుడువానిపల్లె గ్రామానికి చెందిన కంకటి రవిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వల్లంపట్లకు చెందిన కీసరి నాగరాజు డిగ్రీ పూర్తిచేసి కిరాణం దుకాణం నడుపుకుంటున్నాడు. నాగరాజును కలిసిన రవి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.4 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని తరచూ ప్రశ్నించడంతో నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిర్యాని సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత

జమ్మికుంట రూరల్, జూలై 24: పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల బిర్యాని సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత బుధవారం తనిఖీ చేశారు. హోటల్ లోని బిర్యాని, చికెన్, మసాలలు, నూనె, అల్లం వెల్లుల్లీ పేస్టు, ఇతర సామగ్రిని ఆమె పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ పెట్టిన చికెన్, ఇతర ఆహార వస్తువులు వినియోగదారులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. పలు శాంపిల్స్‌ను సేకరించి వెంట తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత మాట్లాడుతూ బిర్యాని సెంటర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను తనిఖీలు నిర్వహించామని తెలిపారు. బిర్యాని, బియ్యం శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తలనీలాల టెండర్లు వాయిదా



మల్యాల, జూలై 24: కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భక్తులు సమర్పించే తలనీలాలకు అధికారులు బుధవారం టెండర్లు నిర్వహించారు. ఏడాది కాలపరిమితికి సీల్‌టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా ముగ్గురు సీల్, 11మంది బహిరంగ వేలంలో పాల్గొన్నారు. అయితే అనివార్య కారణాలతో తలనీలాలు పోగుచేసే హక్కు టెండర్ వాయిదా వేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మరోసారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. అలాగే దేవస్థానం తరుపున పోగు చేసిన తలనీలాలకు కూడా అధికారులు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సీల్ టెండర్‌లో నలుగురు, బహిరంగవేలంలో 23 మంది డిపాజిట్ చేయగా 14 మంది వేలంలో పాల్గొన్నారు. ఇందులో కిలోకి రూ.8,500 శ్వేత రైస్ ఇండస్ట్రీస్ హెచ్చు పాటగా నిలిచింది. హెచ్చు వేలంను కమిషనర్‌కు నివేదిస్తామని తరువాత కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తామని అధికారులు తెలిపారు. వేలంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు అనిల్‌కుమార్, సునీల్ దేవస్థానం సిబ్బంది ఉమామహేశ్వర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, జూలై 24: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల, జూలై 24: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంలో ఉన్న బీఎస్‌సీ అగ్రికల్చర్ గురుకుల కళాశాలలో మౌలిక వసుతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హెదరాబాద్‌లోని అగ్రికల్చర్ కార్యదర్శి ఐఏఎస్ అలుగు శ్యామలకు కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో సరైన ప్రొఫెసర్లు, కోర్సులకు సంబధించిన పరికరాలు లేవని తెలిపారు. పంటకు సంబధించిన స్థలం లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదన్నారు. తాగునీరు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ హెడ్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద గోదావరి ప్రవాహం

ధర్మపురి, జూలై 24: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం కొనసాగుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నదిలోకి నీరు చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం 5 గంటల వరకు కడెం ప్రాజెక్టులోనికి 6,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 2, 18వ నెంబర్ గేట్లు తెరచి 13,428 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. మూడు రోజుల నుంచి గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల మంగళిగడ్డ, సోమవిహార్, సంతోషీమాత ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులను నది వైపు వెళ్లరాదని మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది చర్యలు చేపట్టారు. వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రాయపట్నం వంతెన వద్ద కూడ ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 21,210 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 21,210క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 24.515 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 55.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 548 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 19.059 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.203 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 24: గంజాయి మొక్కలు పెంచి యువకులకు విక్రయిస్తున్న ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన జక్కనపల్లి వివేక్, ఇల్లంతకుంటకు చెందిన అంతటి వేణు, తంగళ్లపల్లికి చెందిన క్రాంతిని బుధవారం అరెస్ట్‌చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామానికి చెందిన వివేక్ ముస్కాని పేటలో నివాసం ఉంటూ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. తంగళ్లపల్లికి చెందిన క్రాంతి వద్ద గంజాయిని కొనగోలు చేస్తున్నాడు. ఈ మేరకు తంగళ్లపల్లిలోని అంబగుడి వద్దకు వస్తున్నారనే సమాచారంతో ముగ్గురు యువకులను పట్టుకొని విచారించారు. దీంతో గంజాయి విక్రయాలు వెలుగు చూశాయి. క్రాంతి తన ఇంట్లోనే గంజాయిని అక్రమంగా సాగుచేస్తూ విక్రయిస్తున్నాడు. వారి వద్ద గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సీఐ మొగిలి

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

సంగెం విద్యార్థి మృతి..



హర్షవర్ధన్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూలై 24 : హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడంతో కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన పోతుకూరి రవీందర్ రెడ్డి - స్వప్న దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాడు. కూతురు బీటెక్ పూర్తి చేయగా కుమరుడు హర్షవర్దన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ ప్రాంతంలో అనురాగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి తన స్నేహితునితో ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి కళాశాలకు వస్తుండంగా ఘట్‌కేసర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హర్షవర్దన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించారు. హర్షవర్దన్ మృతదేహం బుధవారం రాత్రి సంగెం గ్రామానికి చేరుకోవడంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి. గురువారం హర్షవర్దన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 24: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన దుద్దుల రాజయ్య మోటర్ సైకిల్‌పై మానకొండూర్ వైపు వెళ్తున్నాడు. వరంగల్ వైపు వెళ్తున్న కారు తాడికల్ గ్రామ శివారులో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రాజయ్యను డీ కొట్టింది. దీంతో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేశవపట్నం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 24 : మండలంలోని పెద్దబొంకూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులు మంజుల, హఫీజ్‌లు బదిలీపై వెళ్తున్న దృష్ట్యా బుధవారం గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగం, వెంకటరమణ, రవి, కల్వల తిరుపతి, మహ్మద్, శంకర్, మల్లిఖార్జున్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్యదర్శి, ఉపాధ్యక్షుల నియామకం

జ్యోతినగర్, జూలై 24: ఐఎన్‌టీయూసీ అనుబంధ రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ కార్యదర్శిగా ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు బొద్దున శ్రీనివాస్‌ను నియమించినట్లు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీం పాషా తెలిపారు. అలాగే మరో కాంట్రాక్టు కార్మికుడు గోషిక రవిని యూనియన్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు బుధవారం ఇద్దరు నాయకులకు బాబర్ సలీంపాషా నియామకపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బూమల్ల చందర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎండీ రహీం పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం

కళ్యాణ్‌నగర్, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా వీహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 42వ డివిజన్‌కు చెందిన గూడూరి సుశీల అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతుండగా ఆమెకు వీహెచ్ఆర్ ఫౌండేషన్ సిగిరి రాము రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేటీఆర్ జన్మదిన సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు గంజ శివ, రవీంద్రచారి, బొడిగె శ్రీనివాస్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లం మధు, అరుణ్, ఎండీ అన్సు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి, జూలై 24: మండలంలోని జయ్యారంలో ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన తాళ్ల వెంకటేష్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి పరామర్శించి 50 వేల నగదును అందించారు. నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన మృతుడు పోతరాజుల లింగయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక లత, నాయకులు చింతకింది సత్యనారాయణ, గాజుల ప్రసాద్‌గౌడ్, కాసర్ల ఆశాలు, కొమ్ము శ్రీనివాస్, మదన్ మోహన్ రావు, రావుల పున్నం సాగర్, అడ్డకొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం'

కాల్వశ్రీరాంపూర్, జూలై 24: కేంద్ర బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావనే లేకపోవడం బాధాకరమని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేణ సదయ్య, మాజీ ఎంపీటీసీ బంగారు లావణ్య రమేష్, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లం దేవేందర్, కొండిల్ల ప్రశాంత్, ఓదెలు, రవి తదితరులు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏపీ, బీహార్ రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ మనుగడను బీజేపీ కాపాడుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్రంలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు.

అనర్హత వేటు వేయాలి..

మంథని, జూలై 24: అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన మాజీ సీఎం కేసీఆర్‌పై అనర్హత వేటు వేయాలని గజ్వేల్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్‌పై విచారణ జరిపి అనర్హత వేటు వేయాలని కోరారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, జూలై 24: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు బుధవారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయం భక్తులతో సందడిగా మారింది.

పెంచికల్‌పేట్‌లో వైద్య శిబిరం

కమాన్‌పూర్, జూలై 24 : మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి పల్లె దవాఖాన వైద్యురాలు సింధూర, వైద్య సిబ్బంది తిరుపతయ్య, గ్రేష్మాణి, పురుషోత్తం, ఏఎన్ఎం మేటిండా, ఆశ కార్యకర్తలు సుమలత, కల్యాణి తదితరులు ఉన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లి, జూలై 24: జిల్లా పరిధిలోని అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఆదిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 28 వరకు కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు గడువు ఆగస్టు 5వ తేదీ వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, జూలై 24: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.142కోట్ల సింగరేణి నిధులతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కాంట్రాక్టర్లకు, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న 355పడకల ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతలోపం ఉండవద్దని, వేగవంతంగా పనులు చేయాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల పురోగతిపై ఆర్అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఆసుపత్రి భవనం మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి..

కోల్‌సిటీ, జూలై 24: రామగుండంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి నగర సమగ్రాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం నగరపాలక సంస్థ అధికారులు సూచించారు. బుధవారం మల్కాపూర్‌లోని స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి అనంతరం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిసర గ్రామాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రంచేసిన తరువాత వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి ట్రీట్‌మెంట్ చేయాలని, టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల టెండర్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని సూచించారు. జంక్షన్ల అభివృద్ధి సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్స్, సెంట్రల్ లైటింగ్,రోడ్డు విస్తరణ పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని, పారిశుధ్య మెరుగు కోసం ప్రతి రోజు ఉదయం వార్డు అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షించాలని, రోడ్లను పూర్తిస్థాయిలో శుభ్రంచేయాలని, రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నగరపాలకలో పెండింగ్ ఉన్న ఆస్తిపన్ను, నల్లా బిల్లు, ఇతర పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. మహిళాశక్తి కార్యక్రమం కింద నగరంలో ప్రముఖ ప్రదేశాల్లో మహిళా సంఘాలచే క్యాంటీన్లను ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రామగుండం నగరానికి మంజూరైన రూ.100కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను, అమృత్-2 కింద జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, వన మహోత్సవం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాంధీనగర్ వద్ద రూ.4కోట్లతో చేపట్టనున్న ఫ్రూట్ మార్కెట్ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్,ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్, జూలై 24: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీపీ బాలాజీరావు, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్ సుల్తానాబాద్ పట్టణంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు ప్రజలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో గర్రెపల్లి సింగిల్‌విండో ఛైర్మన్ జూపల్లి సందీప్‌రావు, మాజీ ఎంపీపీ పాల రామారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, కౌన్సిలర్లు రేవల్లి తిరుపతి, పసెడ్ల తిరుపతి, రాజమల్లయ్య, మాజీ ఎంపీటీసీ శీలం శంకర్, గొట్టం మహేష్, సాజిద్, భైరగోని ప్రభాకర్‌గౌడ్, రఫిక్, సతీష్, రాకేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ధర్మారం, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచూరి శ్రీధర్, మాజీ మార్కెట్ ఛైర్మన్ బుచ్చిరెడ్డి, పూస్కూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, జూలై 24: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారక రామారావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు భైరెడ్డి రాంరెడ్డి, నాయకులు తానిపర్తి మోహన్‌రావు, న్యాతరి పోచయ్య, మారం కొమురయ్య, బాపయ్య, వినోద్, ప్రవీణ్, తిరుపతిరెడ్డి, అనిల్ కుమార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథులుగా పెద్దపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మమతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ హాజరై కేక్‌కట్ చేశారు. మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్లు పస్తెం హనుమంతు, పెంచాల శ్రీధర్, పెద్ది వెంకటేష్, పూదరి చంద్రశేఖర్, నాంసాని సురేష్ బాబు, రేవల్లి స్వామి, కనుకుర్తి కార్తీక్, కోఆప్షన్ సభ్యులు రహీం, జావిద్, వెన్నం రవి, వాసు, పల్లె మధు, కమటం శ్రీధర్, లవన్ కుమార్, నాగరాజు, అఖిల్, ముబాషీర్, శ్రీనివాస్, కర్రే దేవేందర్ రెడ్డి, మహేష్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూలై 24 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు పెద్దకల్వలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కల్వల భూమేష్, కల్వల మల్లేష్, రవిందర్, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవాన్ని గురువారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి,రవితేజ, నరేష్, లింగారెడ్డి, జాడి వెంకన్న, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి, జూలై 24: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేశోరాం సిమెంటు కంపెనీ ప్రధాన ద్వారం ఎదుట కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ నాయకుడు కౌశిక్ హరి పాల్గొన్నారు.

జ్యోతినగర్, జూలై 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు జన్మదినాన్ని బుధవారం ఎన్టీపీసీలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. బీఆర్ఎస్ జ్యోతినగర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాయి సేవా సమితి ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. అనంతరం సాయి సేవా సమితి ఉచిత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్, 3, 5వ డివిజన్ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు ధరణి పోషం, ఈదునూరి శంకర్, వొల్లాల మల్లేష్, వీరాలాల్, దాసరి ఆనంద్, కంది సతీష్, కుమారస్వామి, రాము, వేణు, కరుణాకర్, జనగామ శంకర్, రాంపెల్లి శ్రీనివాస్, అశోక్, మహిళా నాయకులు శాంత, కొండు రమాదేవి, లక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, జూలై 24 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ సన్నిధిలో బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆలయంలో అర్చనలు నిర్వహించి అనంతరం, కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, కనికిరెడ్డి సతీష్, బుద్ధి పోశెట్టి, చింతం వెంకటస్వామి, పోలోజు రమేష్, రా చర్ల కుమార్, భోగె సదానందం, గడ్డం శ్యామ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 24: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, నాయకులు జెట్టి దేవయ్య, పుల్లూరి రాజమల్లు, కదిరి సతీష్, నిదానపురం దేవయ్య, నూనేటి కుమార్, మాదాసి చందు, మేడిదల రాజ్‌కుమార్, ఓడ్నాల శ్రీనివాస్, సారంగపాణి, జక్కనవేణ కనుకయ్య, జాలిగం రఘు, సువర్ణ బిట్టు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 24 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, సిద్ధిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీల్లు, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ఎదుట లారీ యజమానుల ధర్నా



ఆర్ఎఫ్‌సీఎల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న లారీ యజమానులు

కోల్‌సిటీ, జూలై 24: ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియా రవాణా స్థానిక లారీలకు ఇవ్వాలంటూ బుధవారం లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కందూరు శ్రీనివాస్, తంగెడ పాండు రంగారావు ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ గేటు ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం లారీ యజమానుల పట్ల మొండి వైఖరి అవలంభిస్తుందని, కంపెనీలో ఉత్పత్తి అయ్యే యూరియాను వ్యాగన్ల ద్వారా తరలిస్తూ స్థానిక లారీలకు లోడు ఇవ్వడం లేదని, ఇక్కడ 800లారీలు ఉన్నాయని, వీటిపై 5వేల మంది జీవనోపాధి పొందుతున్నారని, ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీ ప్రారంభమైందంటే తాము మొదట సంతోషపడ్డామని, కానీ ఇప్పుడు లోడింగ్ ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో తాము రోడ్డున పడ్డామని, ఉత్పత్తి అయిన యూరియాను గతంలో టెండర్ పెట్టి లారీల ద్వారా రావాణా చేశారని, 15రోజులుగా తమకు లోడింగ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. ఆర్ఎఫ్‌సీఎల్ పునర్నిర్మాణం కోసం సమీప గ్రామ ప్రజలు తమ భూములను సైతం త్యాగం చేశారని, ఉపాధి దొరుకుతుందనే గంపెడు ఆశతో ఉన్న తమకు లోడింగ్ ఇవ్వకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కూడా తమ గోడును వినిపించామని, ఇప్పటికైనా యూరియా రవాణాకు స్థానిక లారీలకు అవకాశం ఇవ్వాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో లారీ యజమానుల సంక్షేమ సంఘం నాయకులు సంతోష్ రావు, బాబురావు, నర్సింహారెడ్డి, రషీద్, మురళీ, ఆసిఫ్‌పాషాతో పాటు లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.



ఆర్జీ-2లో కారుణ్య నియామక పత్రాల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 24: ఆర్జీ-2 ఏరియాలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం సాధించిన ఐదుగురు అభ్యర్థులకు గురువారం జీఎం సూర్యనారాయణ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజేంద్రప్రసాద్, వంశీధర్‌లు పాల్గొన్నారు.

అద్దె వాహన డ్రైవర్ల సమ్మె విరమణ

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 24: ఓసీపీ-1 ప్రాజెక్టులో అద్దె వాహన డ్రైవర్ల సమ్మె విరమించినట్లు ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు తెలిపారు. గురువారం యజమానులతో జరిగిన చర్చల్లో వేతనాలు పెంచేందుకు అంగీకరించడంతో సమ్మె విరమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 8 గంటల వాహన డ్రైవర్‌కు రూ. 13,000ల వేతనం, 12 గంటల వాహనం నడిపే డ్రైవర్‌కు రూ.15000 చొప్పున వేతనాలు ఇవ్వడానికి అంగీకరించినట్టు తెలిపారు. సంవత్సరానికి రెండు జతల డ్రెస్సులు, దసరా పండుగకు రూ.1000 ఇవ్వడానికి అద్దె వాహన యజమానులు అంగీకారం తెలిపినట్లు వైవీ రావు పేర్కొన్నారు. డ్రైవర్లు యధావిధిగా విధులకు హాజరు కావాలని కోరారు. ఏఐటీయూసీ చొరవ మేరకు యజమానులతో జరిపిన చర్చలు ఫలించిన కారణంగా సమ్మె విరమించినట్లు వైవీ రావు పేర్కొన్నారు.

ఓసీపీ-5లో క్యాంటీన్ ప్రారంభం

గోదావరిఖని, జూలై 24: ఆర్జీ-1 జీడీకే ఓసీపీ-5లో బుధవారం ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఆరెల్లి పోషం, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, మేనేజర్లు రామస్వామి, అనిల్ గబాలే, సేఫ్టీ అధికారి పోనగోటి శ్రీనివాస్, డీజీఎం (వర్క్ షాప్) జితేందర్ సింగ్, సివిల్ ఏజీఎం నాగేశ్వర్ రావు, డీవైఎస్ఈ వరప్రసాద్, పిట్ సెక్రెటరీ ప్రభుదాస్, పిట్ ఇంజనీరు ఎస్వీ రావు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు

- నేరస్థులకు శిక్ష పడే విధంగా పని చేయాలి - రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూలై 24: శాంతి భద్రతల పరిక్షణలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని రామగుండం సీపీ శ్రీనివాస్ అధికారులు సూచించారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పెద్దపల్లి జోన్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో పాదర్శక విచారణ చేయాలన్నారు. ప్రతి సీడీ ఫైల్‌ను, అందులో ఉన్న డాక్యుమెంట్స్‌ను పరిశీలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, పెండింగ్ ఉన్న సీసీ నంబర్లు తీసుకోవాలన్నారు. ప్రతి ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం సీడీ ఫైల్ పొందుపరచాలని, నేర చేదన కంటే, నేర నివారణ చాలా ముఖ్యమని తెలిపారు. శాంతి భద్రతల సంరక్షణలో అలసత్వానికి తావివ్వొద్దని, పోలీస్ స్టేషన్‌లలో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేసి చట్ట పరిధిలో కేసులు నమోదు చేసి, వెంటనే సమస్య పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సీపీ అధికారులకు సూచించారు. ప్రతి నేరస్థుడికి శిక్ష పడేలా కేసులను పక్కా ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. విచారణ వెంటనే పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖాలు చేయాలని, విచారణలో పారదర్శకత పాటించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు సాంకేతిక వ్యవస్థ కూడా ఉపయోగించుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు డ్రగ్స్ డ్రైవ్ కూడా నిర్వహించాలన్నారు. పెట్రోలింగ్ వాహనాలతో సిబ్బంది నేరం జరిగిన వెంటనే స్పందించాలని సూచించారు. నేర చరిత్ర ఉన్న కేడిలు, డీసీలు, సస్పెక్ట్ షీట్ల ఇళ్లను తనిఖీ చేయాలని, పోలీస్ స్టేషన్లలో ఫంక్షనల్ వర్టికల్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతివారం కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. భూ వివాదాలు, సివిల్ కేసుల్లో ఎస్ఓపీ ప్రకారం పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణాకు పాల్పడుతున్న వారిపై నజర్ పెట్టాలన్నారు. ముఖ్యంగా గంజాయితో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్మకాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, వారిపై పీడీ యాక్ట్ కింద నమోదు చేయాలని సీపీ అధికారులకు సూచించారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీపీ, పోలీస్ అధికారులు

ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, పెద్దపల్లి జోన్ సీఐలు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామచందర్‌రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లతో కమిషనర్ సమావేశం

పెద్దపల్లిటౌన్, జూలై 24: వార్డు అఫీసర్లతో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో అందరు భాగస్వాములు కావాలని సూచించారు. ఇంటింటికి పూలు పండ్ల మొక్కలను అన్ని వార్డులో అందేలా చూడాలని ఇంకా అవసరముంటే ఇంటి యజమానులకు అందించాలన్నారు అలాగే అవెన్యూ ప్లాంటేషన్ రోడ్డుకు ఇరువైపులా, చెరువు కట్టలపైన, ఎస్సారెస్పీ కాలువల పైన నాటాలని నాటిన మొక్కలు సంరక్షించలన్నారు గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శానిటేషన్ పనులు సక్రమంగా జరగాలని బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలన్నారు. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ సతీష్,టి పి ఓ తిరుపతమ్మ,, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహార ప్రదర్శనలో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 24: పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించేందుకు బుధవారం స్థానిక అల్ఫోర్స్‌స్కూల్‌లో అవగాహన కల్పించారు. ఏది పౌష్టికమైన ఆహారం, ఏదీ కాదనే విషయాలు పిల్లలకు అర్థమయ్యేలా ఆహార పదార్థాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్య కరమైన ఆహారం గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలతో జిల్లా వైద్యాధికారి సమావేశం

పెద్దపల్లిటౌన్, జూలై 24: ఆర్ఎంపీలతో బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు వారి పేర్ల ముందు డాక్టర్ అని పెట్టుకోరాదని, క్లినిక్ లేదా హాస్పిటల్ అని సైన్ బోర్డులు ప్రదర్శించరాదన్నారు. మెడికల్ షాపులు, ల్యాబ్‌లు నిర్వహించరాదన్నారు. ప్రిస్క్రిప్షన్ రాయరాదని, ఐ.వి. ఫ్లూయిడ్స్ పెట్టకూడదని, యాంటి బయాటిక్స్ లాంటివి మందులు ఇవ్వకూడదని ఆదేశించారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. లేనిచో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డా.కె.వి.సుధాకర్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి, శ్రీయస్. వెంకటేశ్వర్లు, డిప్యూటి డెమో, ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు టి.శ్రీనివాస మూర్తి, ఇతర సభ్యులు యస్.రవీందర్‌రెడ్డి, ఎ.కనకయ్య, టి.శంకర్, యం. సదానందం, కె.వి.చారిలు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలి

పెద్దపల్లి రూరల్, జూలై 24 : జిల్లాలో ఉన్న మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని యజ్ఞ ఎన్‌లైట్ సొసైటీ వ్యవస్థాపకులు పల్లె శాంతిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబిత జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి రాగా వినతిపత్రం అందించారు. క్రైస్తవ మైనార్టీ యువతకు స్వయం ఉపాధికి సంబంధించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాక్రమాలను నిర్వహించి సబ్సిడీ రుణాలను అందించాలని వినతిలో కోరినట్లు శాంతిరాజ్ తెలిపారు. ఏళ్ల గడుస్తున్నా స్వయం ఉపాధికి సంబంధించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించడం లేదని, ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఫాస్టర్స్ జాన్ సుందర్, మహిపాల్ రెడ్డి, డిలైట్, సోలోమోన్ రాజ్, అశోక్, కృపాకర్, రవిపాల్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

కాల్వ శ్రీరాంపూర్, జూలై 24: మండలంలోని ఆశన్నపల్లె గ్రామంలో తల్లిదండ్రులను పోగొట్టుకున్న అనాథ పిల్లలు మంద అభిలాష్, మంద మనిషాలను బుధవారం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పరామర్శించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రూ.5వేల ఆర్థిక సహాయం అందించగా సారయ్యగౌడ్ వారికి అందజేశారు. నగదుతో పాటు 50కిలోల బియ్యం కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో మంద వెంకన్న, మంద అన్వేష్, మంద రాజిరెడ్డి, చిన్నమల్లారెడ్డి, గాజుల మోహన్, పెండ్లి మధుకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 24: కాల్వశ్రీరాంపూర్ మండలం ఉషన్నపల్లెలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం విద్యార్థులకు నోట్‌బుక్కులు, ఇతర సామగ్రిని అందజేశారు. అనంతరం పులి ఇంద్రకరణ్‌రెడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వాటిని బలోపేతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, అమృత సురేష్ కుమార్, ముస్కు సతీష్, నాయకులు తులా మనోహర్‌రావు, రానవేన శ్రీనివాస్, అల్లంల దేవేందర్, కారుపాకల రమేష్ పాల్గొన్నారు.

27న జేఎన్టీయూలో కౌన్సెలింగ్

రామగిరి, జూలై 23: ఈ నెల 27న జేఎన్టీయూలో సింగరేణి న్యూమరరీ కోటా కింద అడ్మిషన్స్ కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందని ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను మంథని జేఎన్టీయూ కళాశాలలో కేటాయింపు చేపట్టిన 36 సూపర్ న్యూమరరీ బీటెక్ సీట్లలో సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లల కోసం కేటాయించిన 18 సీట్ల భర్తీకి ఉదయం 11గంటలకు కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరగనున్నట్లు తెలిపారు. ఎంసెట్‌లో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ జరుగుతుందని సూచించారు. అర్హత గల సింగరేణి ఉద్యోగుల పిల్లలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మంథని, జూలై 24: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలి పెద్దపల్లి వెహికల్ ఇన్స్పెక్టర్ మసూద్‌అలీ కోరారు. బుధవారం మంథని డిపోలో డిపో మేనేజర్ వి.శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రమాద రహిత వారోత్సవాలను ప్రారంభించినారు. ఈసందర్భంగా ఎంవీఐ మసూద్ అలీ మాట్లాడుతూ డ్రైవర్లకు ప్రమాదాలు జరగకుండా విలువైన సలహాలు సూచనలను ఇచ్చారు. డీఎం శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంలో మెలకువలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఏడీఎం ఏంజెల్, అధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గోపాల్, పలువురు డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లు పాల్గొన్నారు.

'వంద శాతం రైతు రుణ మాఫీ చేసి తీరుతాం'

మంథని, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 వరకు రైతులకు వంద శాతం రుణ మాఫీ చేసి తీరుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశలవారీగా రుణమాఫీ ప్రక్రియ జరుగుతుందన్నారు. అహింస గురించి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఈకార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు వొడ్నాల శ్రీనివాస్, పోలు శివ, గోటికారి కిషన్‌జీ, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు, నూకల బానయ్య, గుండా రాజు, గుండా పాపారావు, కిష్టయ్య, రాజు, మంథని శ్రీనివాస్, నరేడ్ల ఓదెలు పాల్గొన్నారు.

'తెలంగాణపై మోదీ కక్ష సాధింపు'

ఓదెల, జూలై 24: తెలంగాణ అభివృద్ధికి బడ్జెట్లో ఎలాంటి నిధులు కేటాయించకుండా రాష్ట్రంపై ప్రధాని మోదీ కక్ష సాధింపులకు దిగుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అన్ని ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్ని కోణాల్లో నిరాశ ఎదురైందన్నారు. తెలంగాణకు నిధులు ఇవ్వలేదని, ఏ ఒక్క రంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కోట సత్యనారాయణ రెడ్డి, గుండేటి ఐలయ్య, పడాల రాజు, చొప్పరి రాజన్న, రెడ్డి రజనీకాంత్, బోడకుంట స్వామి, వంగ కుమార్, గాజుల శివశంకర్, రాపర్తి మల్లేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.